రాజ్యసభ సభ్యుడిని కలిసిన బీఆర్ఎస్ నేతలు

వద్దిరాజు రవిచంద్రను కలిసిన బీఆర్ఎస్ నేతలు

మధిర, జనవరి 29: బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవి చంద్ర (గాయత్రి రవి)ను హైదరాబాద్‌లోని వారి స్వగృహంలో మధిర బీఆర్ ఎస్ నేతలు మొండితోక జయాకర్, మధిర మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో మరోసారి సీఎం కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని, కార్యకర్తలు నాయకులు అధైర్య పడకుండా ప్రజల కోసం పోరాటాలు నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు.

ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.. ముఖం చాటేశాడు

అత్తమామల ఇంటి ముందు యువతి దీక్ష

భర్త ఇంటి ఎదుట తల్లిదండ్రులతో కలిసి దీక్ష నిర్వహిస్తున్న యువతి

బోనకల్లు, జనవరి 29: ప్రేమించి పెళ్లి చేసుకొని ముఖం చాటేయడంతో తనకు న్యాయం చేయాలని ఓ యువతి దీక్షకు దిగిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. బాధితు రాలి తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లికి చెందిన మడుపల్లి గోపికృష్ణ, కోలకోటకు చెందిన చేవల పూజిత బ్రాహ్మణపల్లిలో తన మేనమామ ఇంటికి వస్తూ పోతూ ఉంటుంది. ఈ క్రమంలో గోపికృష్ణకు పూజిత మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. గ్రామ పెద్ద మనుషుల చొరవతో ఖమ్మంలో 28 ఆగస్టు 2024న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వివాహం చేశారు. వివాహమైన సాయంత్రమే హైదరాబాద్ వెళ్లి వస్తానని చెప్పి అప్పటి వరకు మీ అమ్మా నాన్నల దగ్గర ఉండమని చెప్పి వెళ్లాడు. పెళ్లి అయిన 15 రోజుల తర్వాత ఇంటికి రమ్మని పూజిత గోపికృష్ణను కోరింది. వస్తానని చెప్పి బ్రాహ్మణపల్లి చేరుకొని అయ్యప్ప దీక్ష తీసుకున్నాడు. దీక్ష అయిపోయిన తర్వాత తీసుకెళ్తానని చెప్పి చెప్పకుండానే హైదరాబాద్ వెళ్లిపోయాడు. ఈ విషయంపై స్థానిక పెద్దమనుషులను పూజ ఆశ్రయించడంతో వారు చేసేదీ ఏమీలేక చేతులెత్తేశారు. ఈ విషయంపై విసిగి చెందిన పూజిత తనకు న్యాయం చేయాలంటూ అత్తమామ ఉంటున్న ఇంటి ఎదుట తన తల్లిదండ్రులతో కలిసి దీక్షకు దిగింది. తన కూతుర్ని ప్రేమించి పెళ్లి చేసుకున్న వ్యక్తిని తీసుకువచ్చి తన బిడ్డ కాపురాన్ని కాపాడాలని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

ముదిగొండ, జనవరి 29: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 87 మంది లబ్ధిదారులకు ఆర్డీవో నర్సింహారావు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎలిజబిత్, యూడీసీ నాగలక్ష్మి, ఆర్ఐ వహీద, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చెక్కును అందిస్తున్న ఆర్డీవో నరసింహారావు

ముదిగొండ, జనవరి 29: మధిర మండలం కృష్ణాపురం గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ముదిగొండకు చెందిన సాయివర్ధన్ 10వ తరగతి చదువుతూ పాఠశాల హాస్టల్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ముదిగొండలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయివర్ధన్ తల్లిదండ్రులకు ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు రూ.5 లక్షల చెక్కు అందజేశారు.

రైల్వే మూడోలైన్ ప్రారంభం

మూడోలైన్ పనులను పరిశీలిస్తున్న సెఫ్టీ ఆఫీసర్

బోనకల్లు, జనవరి 29: సెంట్రల్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ మాధవి సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ బ్రతేష్‌కు మార్‌జైన్‌తో కలిసి బోనకల్లు రైల్వేస్టేషన్ చేరుకున్నారు. ముందుగా రైల్వేస్టేషన్‌లో అమృత్ పథకం కింద చేపట్టిన పనులను రైల్వేస్టేషన్‌ను సిగ్నలింగ్ వ్యవస్థను ఆమె పరిశీలించారు. అనంతరం కాజీపేట నుంచి విజయవాడ వరకు ఏర్పాటు చేస్తున్న రైల్వే మూడో లైన్ పనులు మోటమర్రి రైల్వేస్టేషన్ నుంచి పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ వరకు పూర్తి కావడంతో బోనకల్లు రైల్వే వద్ద వారు ప్రారంభించారు. రైల్వేస్టేషన్ నుంచి మోటమర్రి రైల్వేస్టేషన్ వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మోటార్ ట్రాలీపై వెళ్లి ఈ మార్గాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఆర్ఎస్ శ్రీనివాస్, సీఈఈ సురజాన్‌రెడ్డి, సీఎస్‌టీ గుడేశార్, సీఈ సునీల్‌కుమార్‌వర్మ, సీపీవో సత్యప్రకాశ్, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

మధిర, జనవరి 29: ప్రతిఒక్కరూ ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం మధిర పట్టణంలో దుకాణాల ట్రేడ్ లెసెన్స్‌లను మున్సిపాలిటీ అధికారులు పరిశీలించారు. ట్రేడ్ లైసెన్స్ ఉన్న వారు రెన్యూవల్ తప్పనిసరిగా చేయించుకోవాలని, ట్రేడ్ లైసెన్స్ కనిపించే విధంగా షాపుల్లో పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

కూసుమంచి, జనవరి 29: మండలంలోని ఎర్రగడ్డ తండా, దుబ్బతండలా పరిధిలోని పంట పొలాలను బుధవారం మండల వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. ఏవో రామడుగు వాణీతో పాటు పాలేరు ఏఈవో మానస పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య

మధిర, జనవరి 29: ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జీ.అరుణ అన్నారు. బుధవారం మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మధిర నందు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాలలో ఉత్తమ నైపుణ్యం కలిగిన బోధకులు ఉన్నారని, బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ గ్రూపులు జనరల్ కంప్యూటర్ కోర్సులు ఉన్నాయన్నారు. అధ్యాపకులు ఎస్.ఇందిర, పీ.సుజాత, ఎస్.కే.అఫ్రోజ్, అనిత, జ్యోతి, వెంకటలక్ష్మి, మాధురి పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి

ఖమ్మం అర్బన్ తహసీల్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న మాస్‌లైన్ నేతలు

రఘునాథపాలెం, జనవరి 29: రాష్ట్ర ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతుభరోసా పథకాలను అర్హులందరికీ అందించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కమిటీలు, కాంగ్రెస్ నేతల జోక్యం లేకుండా వీటిని నిజమైన నిరుపేదలకు అందజేయాలని కోరారు. ఈ మేరకు ఆ పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ముందుగా నయాబజార్ సెంటర్ నుంచి పీఎస్ఆర్ రోడ్డు మీదుగా తహసీల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల కోసం లక్షలాదిమంది పేదలు దరఖాస్తులు చేసుకుంటే.. ప్రభుత్వం వెల్లడించిన జాబితాలో అర్హుల పేర్లు లేకుండా పోయాయని విమర్శించారు. ఇందుకు ఇందిరమ్మ కమిటీలే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఇందిరమ్మ ఇండ్లను మొదటి విడతలో తమ కార్యకర్తలకు, బంధువులకు ఇప్పించుకునేందుకు జాబితాను సిద్ధం చేసుకున్నారని అన్నారు. దీనిపై అధికారుల దృష్టి పెట్టి అర్హత కలిగిన నిజమైన పేదలకే ఇందిరమ్మ ఇండ్లు అందించాలని డిమాండ్ చేశారు.

లబ్ధిదారులకు పథకాలు మంజూరు చేయాలి

కొణిజర్ల, జనవరి 29: అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించాలని సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సీ.వై.పుల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం కొణిజర్లలో ఖమ్మం జిల్లా కమిటీ పిలుపు మేరకు కొణిజర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీ.వై.పుల్లయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విధి విధానాలను పాటించడం లేదని, అర్హులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరు గ్యారెంటీలు అమలు కోసం ధర్నా

తిరుమలాయపాలెం, జనవరి 29: కాంగ్రెస్ ప్రభుత్వం హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీటీ నర్సింహారావుకు వినతిపత్రం అందజేశారు.

అర్హులకే ప్రభుత్వ పథకాలు ఇవ్వాలి

కారేపల్లి, జనవరి 29: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకే ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కారేపల్లి, కామేపల్లి సంయుక్త మండల కార్యదర్శులు గుమ్మడి సందీప్, గుగులోత్ తేజానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

బోనకల్లు : అవగాహన కల్పిస్తున్న వైరా ఎంవీఐ వరప్రసాద్

రఘునాథపాలెం, జనవరి 29: ట్రాఫిక్ నిబంధనల గురించి విద్యార్థి దశలోనే తెలుసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు జిల్లా రవాణాశాఖ అధికారులు బుధవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి డీటీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాహనాలను నడిపేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నియమాలను వివరించారు.

కారేపల్లి, జనవరి 29: ప్రయాణ సమయంలో వాహనదారులు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని కారేపల్లి ఎస్సై ఎన్.రాజారాం అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బుధవారం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులతో మాట్లాడుతూ.. వాహనాలపై రోడ్డు మీద ప్రయాణించేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ కార్డు, ఇన్సూరెన్స్‌తో పాటు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు.

బోనకల్లు, జనవరి 29: అతివేగం ప్రమాదకరమని, రహదారి భద్రతా నియమాలను ప్రతిఒక్కరూ పాటించాలని వైరా ఎంవీఐ వరప్రసాద్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక ఫైన్ హైస్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రతా మహోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలని కోరారు. రహదారి ప్రయాణాల్లో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

సత్తుపల్లిటౌన్, జనవరి 29: వేగంకన్నా ప్రాణం ఎంతో విలువైందని, రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని సత్తుపల్లి సహాయ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దినేష్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత అవగాహన మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక గీతాంజలి విద్యాలయంలో ప్రిన్సిపాల్ చీకటి శ్రీనివాసరావు అధ్యక్షతన విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంవీఐ దినేష్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల చేత రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు.

వైరాటౌన్, జనవరి 29: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా వాహనదారులు, ఓనర్స్, డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజు మాట్లాడుతూ.. వాహనదారులు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

సొసైటీ గొడౌన్‌ను పరిశీలించిన డీఏవో, ఏడీఏ, సొసైటీ చైర్మన్

'నమస్తే' కథనానికి స్పందన

సొసైటీలో ఎరువుల అమ్మకాలకు చర్యలు

సొసైటీ గోడౌన్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ డీఏవో, ఏడీఏ, ఏవో, సొసైటీ చైర్మన్ లక్ష్మణ్‌నాయక్

ఖమ్మం రూరల్, జనవరి 29: మండలంలోని ఏకైక ఏదులాపురం వ్యవసాయ పరపతి సంఘంలో తిరిగి ఎరువుల క్రయవిక్రయాలను పునురుద్దరణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయశాఖ అధికారి ఉమా నగేష్ తెలిపారు. బుధవారం నమస్తే తెలంగాణలో 'రూరల్‌లో ఎరువులు ప్రైవేట్‌లోనే' అనే కథనం ప్రచురితం అయిన సంగతి తెలిసిందే. దీంతో అటు సొసైటీ, ఇటు వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం నాయుడుపేటలో ఉన్న సొసైటీ పాత గోడౌన్‌ను జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య కూసుమంచి డివిజన్ ఏడీఏ సరిత, సొసైటీ చైర్మన్ లక్ష్మణ్‌నాయక్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ఉమానాగేష్ మాట్లాడుతూ.. జిల్లా అధికారుల సూచనల మేరకు మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడి సొసైటీకి ఎరువులు సరఫరా చేయాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఎరువుల కౌంటర్ లేక రైతులు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని వార్త కథనం ప్రచురితం చేయడంపై పలువురు మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

క్వింటా మిర్చికి రూ.20 వేల కనీస ధర ఇవ్వాలి

వైరాలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల నిరసన

ఆందోళన చేస్తున్న మిర్చి రైతులు

వైరా టౌన్, జనవరి 29: క్వింటా మిర్చికి రూ.20 వేల కనీస ధర చెల్లించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు డిమాండ్ చేశారు. సరైన ధర లేక, భవిష్యత్తులో ధర పెరుగుతుందన్న ఆశలేక ఖమ్మం జిల్లాలోని మిర్చి రైతులందరూ తక్కువ ధరకు తమ పంటను విక్రయించుకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వచ్చి నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా మిర్చికి రూ.20 వేల కనీస ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా వైరా పట్టణ పరిధిలోని లాలాపురంలో రైతుసంఘం ఆధ్వర్యంలో బుధవారం మిర్చి పంటలను, కళ్లాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తామర పురుగు, తెగుళ్ల వంటి కారణాల వల్ల మిర్చి రైతులు ఇప్పటికే తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు సరైన ధరలు లేకపోవడం వారిని ఆత్మహత్యలవైపు నెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం బాధ్యులు సంక్రాంతి నర్సయ్య, దొడ్డపనేని కృష్ణార్జున్‌రావు, సంక్రాంతి పురుషోత్తం, వడ్లమూడి మధు తదితరులు పాల్గొన్నారు.

చిత్తలూరి దంపతులకు నివాళి

సత్తుపల్లిటౌన్, జనవరి 29: తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకుడు, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు, గురుజ్యోతి సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చిత్తలూరి ప్రసాద్ తల్లిదండ్రులు చిత్తలూరు వీరమ్మ, రాజ ఇటీవల మృతి చెందిన సందర్భంగా బుధవారం సత్తుపల్లి పట్టణంలోని వివిధ స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ప్రసాద్ స్వగృహంలో నివాళి అర్పించారు.

29ఎస్‌పీఎల్‌టౌన్06: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సత్తుపల్లి కార్పెంటర్స్ అసోసియేషన్ బాధ్యులు

కార్పెంటర్లకు సంక్షేమ పథకాలు అందించాలి

సత్తుపల్లిటౌన్, జనవరి 29: కార్పెంటర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవాలని సత్తుపల్లి కార్పెంటర్స్ అసోసియేషన్ బాధ్యులు కోరారు. బుధవారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. వెలిశాల లక్ష్మణాచారి, వీ.సురేష్, పీ.హరీష్ కుమార్, ఎస్.కే.బాబా, ఆర్.అప్పాచారి, లక్ష్మీనర్సయ్య, రామకృష్ణ, మోహనచారి, నాగేంద్రచారి పాల్గొన్నారు.

గోశాల, అంగన్‌వాడీ కేంద్రానికి వితరణ

గోశాలకు దాణా వితరణ చేస్తున్న సేవా సమితి సభ్యులు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 29: మౌనీ అమావాస్య సందర్భంగా స్థానిక గోశాలకు దాణాను, అంగన్‌వాడీ కేంద్రానికి నిత్యావసర వస్తువులను ఖమ్మంలోని స్తంభాద్రి సేవా సమితి బాధ్యులు బుధవారం వితరణ చేశారు. స్థానిక పెద్దలు, దాల్‌మిల్ యజమానులు, మార్కెట్ వ్యాపారులు మిత్రుల సహకారంతో సమకూర్చిన రూ.61 వేలతో గోదాణాను గోశాలకు, వాటర్ ఫిల్టర్‌ను అంగన్‌వాడీ కేంద్రానికి వితరణ చేశారు.

గోశాలకు సామగ్రి వితరణ

వైరాటౌన్, జనవరి 29: వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం వైరా వేద పాఠశాల నందు గోశాలకు దేవబత్తిని కృష్ణచైతన్య, లావణ్య దంపతుల కుమారుడు ఆద్విక్ పుట్టినరోజు సందర్భంగా గోశాలకు కావాల్సిన సామగ్రిని అందించారు. మధ్యాహ్నం గొల్లపూడి వృద్ధాశ్రమంలో సింగ్ నాగేశ్వరరావు, నాగమణి దంపతుల మనువడు సింగ్ చంద్రహాస్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిష్టర్ తనఖా చేయించుకొని **మేకల కాంతరావు, S/o. బొర్రయ్య, వయస్సు** : 35 సం||లు, **వృత్తి** : వ్యవసాయం, **నివాసం**: ఇ.నెం. 3-19, లింగాల గ్రామం, కల్లూరు మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 2 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా రిజిస్ట్రారు, జిల్లా పరిషత్ ఖమ్మం, కల్లూరు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసు పరిధిలోని కల్లూరు మండలం, లింగాల గ్రామ పంచాయితీ, యర్రబోయినపల్లి గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా విస్తీర్ణం. 257.77 చ||గ||లకు సమానమగు 215.49 చ||మీ||ల నివేశన స్థలము మరియు సదరు స్థలములో 2-51 (Assessment No. 350) నెంబరు గల పూరిల్లు వైశాల్యం. 100-00 చ||అడుగులు మరియు ఇందు గల విద్యుత్ ఫిట్టింగ్స్, సమస్త ఫిక్చర్స్ యుక్తముగా **డాక్యుమెంట్ నెం: 1960/2024**, గల స్థిరాస్తికను సరిహద్దులు : **తూర్పు**: మేకల బొర్రయ్య గారి మిగిలిన స్థలము, **పడమర**: గ్రామ పంచాయితీ రోడ్డు, **ఉత్తరం**: గ్రామ పంచాయితీ రోడ్డు, **దక్షిణం**: మేకల బొర్రయ్య గారి మిగిలిన స్థలము.

ఇట్లు : **గండ్ర దీనదయాళ్**
అడ్వకేట్ & నోటరీ, సత్తుపల్లి
ఖమ్మం జిల్లా, సెల్ : **9848578963**

కరపత్రాల ఆవిష్కరణ

ఖమ్మం అర్బన్, జనవరి 29: ఇంటర్ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత విద్య కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం ఐడీవోసీలోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో బుధవారం జరిగింది. ఇంటర్ విద్యాధికారి కే.రవిబాబు, ప్రిన్సిపల్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్, కార్యదర్శి నవ్య జ్యోతి హాజరై ఈ కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రిన్సిపాళ్ల సంఘ బాధ్యులు డీ.ప్రమీల, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం కార్యదర్శి బీ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

ఖమ్మం అర్బన్, జనవరి 29: ఖమ్మం నగరంలోని పేదలకు ఖమ్మానికి చెందిన స్నేహబృందా ఫౌండేషన్ బాధ్యులు బుధవారం అన్నదానం చేశారు. నగరంలోని జడ్పీ సెంటర్‌లో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని వయోజన విద్య జిల్లా కో ఆర్డినేటర్ అనిల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు ఉషా, వసుంధర, కళావతి, లత, ఇందు, పద్మ పాల్గొన్నారు.

సీడీసీ చైర్మన్‌గా సూర్యానారాయణరెడ్డి

కూసుమంచి, జనవరి 29: నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురం గ్రామంలోని కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్‌గా కూసుమంచి మండలం ఈశ్వరమాదారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యరబోలు సూర్యానారాయణరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర డైరక్టర్ ఆఫ్ షుగర్ కేన్ కమిషనర్ జీ మల్సూర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కౌన్సిల్ సభ్యులుగా నేలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన గుదిమళ్ల మధు, నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన జోగుపర్తి క్రిష్ణారావు, మధుకాన్ షుగర్‌కు చెందిన అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య, మధుకాన్ షుగర్ జనరల్ మేనేజర్ కే అప్పారావు కౌన్సిల్ సభ్యులుగా నియమించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ఎర్రుపాలెం, జనవరి 29: మండల పరిధిలోని రాజుపాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్వేచ్ఛ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్లను బుధవారం పంపిణీ చేశారు. సంస్థ కార్యదర్శి డాక్టర్ చల్లా కోటయ్య మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పట్టుదలతో క్రమశిక్షణగా మంచిగా చదువుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు.

మాధవరావుకు అవార్డు

వేంసూరు, జనవరి 29: వేంసూరు గ్రామానికి చెందిన కాకర్ల మాధవరావుకు 108 సర్వీస్ వారు స్టార్ ఈఎంటీ అవార్డు ప్రధానం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా 108 సర్వీసెస్ ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. డిసెంబర్‌లో 108 అంబులెన్స్‌లో అత్యుత్తమ సేవలు అందించినందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన వారిలో వేంసూరు 108 పనిచేస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌కు ఈ అవార్డు ప్రధానం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

తిరుమలాయపాలెం, జనవరి 29: మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో బుధవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెవుల ఉపేందర్ (28) మద్యానికి బానిసగా మారాడు. ఈ క్రమంలో మంగళవారం భార్య గంగాభవానీతో గొడవపడి పురుగుమందు తాగాడు. అతన్ని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టైనిటాట్స్ విద్యార్థినికి జాతీయస్థాయి అవార్డు

భువన చంద్రికను అభినందిస్తున్న కరస్పాండెంట్ భాస్కర్

ఖమ్మం అర్బన్, జనవరి 29: ఖమ్మం టైనిటాట్స్ హైస్కూల్ విద్యార్థిని భువన చంద్రిక.. కూచిపూడి నృత్య ప్రదర్శనలో జాతీయస్థాయిలో అవార్డులను సొంతం చేసుకుంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో హైదరాబాద్ బిర్లామందిర్‌లో ఇటీవల నిర్వహించిన పోటీల్లో టైనిటాట్స్ పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థిని భువన చంద్రిక పాల్గొన్నది. ఉత్తమ ప్రతిభ చూపి జాతీయస్థాయిలో 'నాట్యబ్రహ్మ', 'నాట్య శిరోమణి' అవార్డులను దక్కించుకుంది. ఈ మేరకు అవార్డులు పొందిన విద్యార్థిని భువన చంద్రికను కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ అభినందించారు. అంతేగాక 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు'కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే ఉపేక్షించేది లేదు

కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ రాజేందర్

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న ప్రొ.రాజేందర్

ఖమ్మం అర్బన్, జనవరి 29: పరీక్షల నిర్వహణలో నిబంధనలు పాటించాలని కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ సూచించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నగరంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల సహా రెండు ప్రైవేటు కళాశాలల పరీక్షా కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలల సిబ్బందికి పలు సూచనలు చేశారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఎనిమిది మందిని డిబార్ చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ అధికారి ప్రొఫెసర్ సౌజన్య పాల్గొన్నారు.

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

మాట్లాడుతున్న నోడల్ అధికారి నాగప్రసాద్

మామిళ్లగూడెం, జనవరి 29: రానున్న వేసవిలో అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించడానికి సమష్టిగా కృషిచేయాలని జిల్లా నోడల్ అధికారి జీ.నాగప్రసాద్.. విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఖమ్మంలోని ఎన్‌పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈలు సురేందర్, శ్రీనివాస్ సమక్షంలో టాన్స్‌కో, డిస్కంల డీఈఈలు, ఏడీఈఈలతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి సమీపిస్తున్నందున ప్రత్యేక కార్యాచరణ ద్వారా పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని సబ్ స్టేషన్లలో అవసరానికి సరిపడా పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. డీఈఈలు నాగేశ్వరరావు, రామారావు, రాములునాయక్, శ్రీనివాస్, బాబూరావు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో అన్నదానం

ఖమ్మం సిటీ, జనవరి 29: నగరంలోని మౌంట్‌ఫోర్ట్ హైస్కూల్ 60 వసంతాల ఉత్సవాలను పురస్కరించుకొని పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో భాగంగా జిల్లా సార్వజనీన ఆసుపత్రిలోని రోగులకు, వారి సహాయకులకు బుధవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బీ.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి స్మృతులను గుర్తుంచుకుని అదే పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పలు రకాల సేవలను అందించడం హర్షణీయమని అన్నారు. వైద్యాధికారులు, పూర్వ విద్యార్థులు, ఇతర ప్రముఖులు వరికూటి సుబ్బారావు, రాంబాబు, గుండాల కృష్ణ, వంజాకు లక్ష్మీనారాయణ, రమేశ్‌బాబు, హనుమాన్, అయ్యదేవర రాంబాబు, ప్రవీణ్, వైవీ శర్మ, మానుకొండ శివకుమార్, లక్ష్మణబాబు, భవానీ ప్రసాద్, బెండడి కుమార్, పాపిట్ల ఉపేందర్, బాలశౌరి, శేఖర్, ప్రభుదాసు పాల్గొన్నారు. తొలుత మౌంట్‌ఫోర్ట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

తోటి విద్యార్థులతో ఆడుకుంటూ ఈ నెల 25న కింద పడిన బాలిక

రఘునాథపాలెం, జనవరి 29: తోటి విద్యార్థులతో ఆడుకుంటూ కిందపడి తలకు గాయమైన ఓ విద్యార్థిని చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని కోయచలక గ్రామంలో చోటుచేసుకుంది. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ కథనం ప్రకారం.. కోయచలక గ్రామానికి చెందిన పొట్ట శ్రావణి (14) గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కాగా, ఈ నెల 25న పాఠశాలలో ఆడుకుంటున్న క్రమంలో ప్రమాదవశాత్తూ కిందపడిపోయింది. అప్పుడు తలకు తీవ్ర గాయం కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. కాగా, అప్పటి నుంచి చికిత్సపొందుతున్న శ్రావణి.. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతిచెందింది. ఆమె తండ్రి కూడా ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, తల్లి మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వీధులపై చెత్త వేస్తే చర్యలు : మున్సిపల్ కమిషనర్

సత్తుపల్లిటౌన్, జనవరి 29: సత్తుపల్లి పట్టణంలోని పలు వీధుల్లో వ్యాపారస్తులు వీధులపై చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ రవిబాబు హెచ్చరించారు. బుధవారం ఉదయం పట్టణంలోని పలు వీధులు తిరుగుతూ.. వీధులపై చెత్త వేసే వారిని గుర్తించి చెత్త వేసిన వారికి ఫైన్ విధించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ.. పట్టణ పరిధిలోని వీధుల్లో బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడవేయవద్దని వ్యాపారస్తులను, పట్టణ వాసులను కోరారు.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతి

వేంసూరు, జనవరి 29: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపు మేరకు గురువారం ఉదయం 10 గంటలకు మర్లపాడు సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వినతిపత్రం అందించనున్నట్లు వేంసూరు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాల వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పెనుబల్లి, జనవరి 29: కల్లూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వనున్నట్లు కల్లూరు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు తెలిపారు.

సింగరేణి క్వార్టర్స్‌లో సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లిటౌన్, జనవరి 29: సింగరేణి క్వార్టర్స్‌లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హెచ్ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు జేవీఆర్ ఓసీ పీవో ప్రహ్లాద్‌ను బుధవారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ వరికూటి శ్రీనివాసరావు, ఎం.డీ.అజ్జర్‌ఖాన్, ఎం.డీ.నసీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి

మధిర, జనవరి 29: రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని మధిర ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు అన్నారు. బుధవారం మధిర ఆత్మ కమిటీ ఎంపిక సందర్భంగా రైతు వేదికలో ఇన్‌చార్జి ఏడీఏ మిట్టపల్లి సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్‌తో పాటు, 30 మంది డైరెక్టర్లు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు కే.సాయిదీక్షిత్ (మధిర), పీ.వినయ్‌కుమార్ (ఎర్రుపాలెం), బీ.సాయి, ఎస్.మానస (చింతకాని), టీ.వేణుయాదవ్ (ముదిగొండ), వ్యవసాయ అధికారులు టీ.జిష్ణు, బీ.అమృత, కే.గురుమూర్తి, టీ.సిందూర్, ఎన్.నాగసాయి, ఆత్మ సిబ్బంది రమేష్, బీ.కార్తీక్ పాల్గొన్నారు.